క్లుప్తంగా

ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు



గుర్తింపు కార్డులతో ఉపాధ్యాయులు, ఎంపీడీవో జానకి, తదితరులు

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ భీమిలి మండల శాఖ ఆధ్వర్యంలో 110 మంది ఉపాధ్యాయ యూనియన్ సభ్యులకు మండల శాఖ అధ్యక్షుడు కె.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఎంపీడీవో జానకి సోమవారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సమాజానికి మార్గదర్శకులుగా నిలిచే ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవితకు బంగారు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు శివరాణి, జయప్రద, మండల శాఖ ప్రధాన కార్యదర్శి మహాలక్ష్మినాయుడు, జిల్లా అకడమిక్ సెల్ సభ్యుడు దుంపల దాలయ్యబాబు, గౌరవ అధ్యక్షుడు ఎల్.కనకేష్, అర్బన్ అధ్యక్షుడు కోటి, ప్రధాన కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు ఊరేగింపు



సంతపేట కుమ్మరివీధి నుంచి అక్షింతలు ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

తగరపువలస: అయోధ్య భవ్య రామ మందిర ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా అక్కడి నుంచి వచ్చిన అక్షింతలు సోమవారం జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతపేట కుమ్మర వీధి రామాలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళలు తలపై అక్షింతలు, శ్రీరాముని చిత్రపటాలతో పురవీధుల్లో శ్రీరామనామ సంకీర్తనతో ఊరేగారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం ప్రతినిధులు కింతలి రాజులు, అరటికోట్ల వెంకటేష్, తాటిపూడి నర్సిబాబు, పాట్నూరు పోలిరాజు, జామి శ్రీను, ఊసెట్టి రమణ, బీజేపీ నాయకులు గనిశెట్టి పార్వతి, గుజ్జు రాము, పెదగాడ విజయ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: ఆదర్శ పురుషుడు, ప్రజలందరి ఆరాధ్య దైవం అయోధ్య రాముని అక్షింతలు మధురవాడకు చేరాయి. అయోధ్య శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ నుంచి ఇక్కడికి తీసుకొచ్చారు. సోమవారం కొమ్మాది జంక్షన్ వద్ద గల త్రిశక్తి ఆలయంలో బీజేపీ 6వ వార్డు అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్ రాజు (పెదబాబు) ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్షింతలు అన్ని చోట్లా పంపిణీ చేస్తామని తెలిపారు. మధురవాడ పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా తరలిరాగా వారికి పంచిపెట్టారు. కార్యక్రమంలో యండాడ మండల కన్వీనర్ ఎ.సురేంద్ర కుమార్, ఉపాధ్యక్షుడు పిల్లా ఈశ్వరరావు, కార్యదర్శి జి.చంద్రశేఖర్‌రాజు, కోశాధికారి పి.సత్యసాయి, మాజీ అధ్యక్షుడు పిల్లా హిమాలయన్ తదితరులు పాల్గొన్నారు.



కొమ్మాది జంక్షన్ సమీపంలోని త్రిశక్తి ఆలయంలో అక్షింతలతో భక్తులు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అదిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అదిష్ఠింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం సహస్రనామార్చన ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు ఈపూజ నిర్వహించారు. 1001 నామాలతో స్వామికి అర్చన చేశారు. తులసి ప్రసాదం భక్తులకు అందజేశారు.

ఆహ్లాదం.. విజ్ఞానం...!

ఆకట్టుకుంటున్న ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు



పాత టైర్లతో తయారు చేసిన కుర్చీలు, టేబుల్ సెట్



వ్యర్థాలతో సుందరంగా తీర్చిదిద్దిన తగరపువలస ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్

తగరపువలస: జీవీఎంసీ పరిధిలోని ప్రతీ జోన్‌లో రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) పేరుతో ఒక సెంటర్‌ను తయారు చేస్తున్నారు. వీటిని ఆయా ప్రాంతాల ప్రాధాన్యతను బట్టి పిల్లలు, యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నారు. భీమిలి జోన్‌కు సంబంధించి తగరపువలస జీవీఎంసీ గ్రంథాలయం ఎదురుగా యువతను దృష్టిలో పెట్టుకుని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ రూపుదిద్దుకుంది. మధురవాడ జోన్‌లోని ఎండాడలో చిన్నారుల కోసం మరో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఏర్పాటు చేశారు. వీటికి అయ్యే వ్యయాన్ని ప్రాథమికంగా జీవీఎంసీయే భరించింది. వీటి ఏర్పాటుకు వసతులు, భవనాలు ఆయా జోన్‌లు సమకూర్చాయి. దేశవ్యాప్తంగా 115 పట్టణాల్లో ఇలాంటి ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు వెలిసినట్టు తెలుస్తోంది. స్థానికంగా ప్రజలు వినియోగించి వదిలేసిన దుస్తులు, ఫర్నీచర్, పుస్తకాలు, కాగితాలు, టైర్లు, పాత ఇనుపసామగ్రి, వంట పాత్రలు, బాటిళ్లను ఇక్కడ అప్పగిస్తే కొంత మొత్తం ఇచ్చేలా ప్రతిపాదన కూడా ఉంది. ఇలా ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు అప్పగించిన పాత సామగ్రిని సెంటర్‌లో వినియోగించుకునేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. తగరపువలసలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను బుక్ కేఫ్‌గా, ఎండాడలోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను క్రీడాప్రాంగణంగా పిలుస్తున్నారు.

యువత, చిన్నారులే లక్ష్యంగా...

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ల లోపల, వెలుపల పెయింటింగ్‌తో అందంగా తీర్చిదిద్దారు. బయటి ప్రాంతంలో పాత టైర్లకు రంగులు వేసి పూలకుండీలుగా వినియోగంలోకి తీసుకొచ్చారు. లోపల యువతకు పనికొచ్చేలా పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు పొందుపరిచారు. వీరు కూర్చుని చదుకునేలా ఆయిల్ డ్రమ్ములతో టేబుళ్లు, టైర్లతో కుర్చీలు, అల్మరాలు తీర్చిదిద్దారు. పాత సైకిళ్లు, వాటి విడిభాగాలు, స్కూటర్ విడిభాగాలకు రంగులు వేసి విద్యుత్‌దీపాలుగా అలకరించారు. డ్వాక్రా మహిళల ద్వారా ఆర్‌వో ప్లాంట్, సెంటర్‌కు వచ్చేవారికి కాఫీ ప్లాంట్‌ను దీనికి అనుసంధానం చేశారు. ప్రస్తుతం కేంద్రానికి అవసరమైన రీసైక్లింగ్ ద్వారా తయారు చేసిన వస్తువులు కొన్నింటిని నాగ్‌పూర్ నుంచి రప్పించగా మిగిలినవి ఇక్కడే ఇండియన్ యూత్ ఫర్ సొసైటీ ద్వారా తయారు చేయిస్తున్నారు. ఈ సెంటర్ ప్రారంభమైతే కనీసం 10 శాతం మంది ప్రజలు స్పందించి ఇంట్లో వినియోగించి వదిలేసిన వస్తువులను ఇక్కడికి అప్పగిస్తే యువతకు ఉపయోగకరంగా ఉంటుందని విద్యావంతులు అంటున్నారు. ఎండాడ ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఆవరణలో చిన్నారులు ఆడుకునేందుకు వ్యర్థ వస్తువులతో క్రీడా పరికరాలు ఏర్పాటు చేశారు.



వ్యర్థాలతో రూపొందించిన తగరపువలస సెంటర్‌లో ఫర్నీచర్, గ్రంథాలయం



ఎండాడలోని ట్రిపుల్ ఆర్ సెంటర్



ఎండాడ సెంటర్ ఆవరణలో క్రీడా వస్తువులు

వ్యర్థ వస్తువులే వనరులుగా...



ప్రజలు వినియోగించి పడేసే వ్యర్థ వస్తువులనే వనరులుగా చేసుకుని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దీంతో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు ఆహ్లాదంతోపాటు విజ్ఞానం పెంపొందించే కేంద్రాలుగా తయారయ్యాయి.

– కాసా శేఖర్, మెడికల్ షాపు అటెండెంట్, తగరపువలస

నిరుపయోగ భవనాలు వినియోగంలోకి..



గతంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ల ఏర్పాటు ద్వారా వినియోగంలోకి తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరూ విశ్రాంతి తీసుకునేందుకు ఈ సెంటర్లలో సేద తీరుతున్నారు.

– ఆళ్ల రవిగణేష్, అర్చకుడు, చిట్టివలస

చిన్నారులకు ఎంతో ఉపయోగకరం



ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ల రూపకల్పనలో జీవీఎంసీ ప్రధానపాత్ర పోషించింది. వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల పర్యావరణానికి హాని. అందువల్ల ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ల ద్వారా వాటిని వినియోగంలోకి తీసుకొచ్చారు.

– నరహరిశెట్టి రమేష్, ఉపాధ్యాయుడు, బంగ్లామెట్ట

378 రోజులు దీక్ష చేసిన గురుభవానీకి సన్మానం



గురు భవానీని సన్మానిస్తున్న భక్తులు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు సంగివలస అల్లూరి సీతారామరాజు కాలనీకి చెందిన గురుభవానీ జి.లక్ష్మీపతిరాజు భవానీ దీక్ష చేపట్టి సోమవారం నాటికి 378 రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా స్థానిక జీఆర్ డ్రై ఫ్రూట్స్ షాపు యజమాని ఉమా ఆయనను ఘనంగా సత్కరించారు. 2022 డిసెంబర్ 19న ఈయన దీక్ష చేట్టారు. ఈ నెల 3న దీక్ష విరమించి ఇంద్రకీలాద్రిపై నిర్వహించే చండీయాగానికి బయలుదేరి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా గురుభవానీని సన్మానించారు.

శేరిఖండంలో సామూహిక కుంకుమార్చన



శేరిఖండంలో కుంకుమార్చనలో మహిళలు

పద్మనాభం: మండలంలోని శేరిఖండంలో పుప్పాల అప్పన్నబాబు, పుప్పాల ఆదినారాయణ ఇంటి ప్రాంగణంలో సోమవారం ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా విశాఖపట్నం కనక మహాలక్ష్మి ఆలయం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శేరిఖండం, రెడ్డిపల్లి, పద్మనాభం, తునివలస, పాట్నూరు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, శేరిఖండం సర్పంచ్ పల్లంటి చిన్నారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోరెడ్డి దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి నవనీత అలంకరణ



శ్రీనివాసనగర్‌లో నవనీతం, పండ్లు అలంకరణలో స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



భీమిలి కృష్ణాకాలనీలో నవనీత అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

మధురవాడ: నగరంపాలెం రోడ్డు శ్రీనివాసనగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని నూతన సంవత్సరాది వేళ నవనీతం, పండ్లు అలంకరణలో అత్యంత సుందరంగా అలంకరించారు. ఈ నవనీత స్వామిని దర్శించుకోవడానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. సుమారు 20 కేజీల వెన్న, 5 కేజీలు వివిధ రకాల పండ్లతో వేంకటేశ్వరస్వామిని సుందరంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు మావుదూరి విజయమోహనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. మధురవాడ పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

భీమునిపట్నం: భీమిలి కృష్ణాకాలనీ కొండపైవున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారికి నవనీత సేవ (వెన్నతో అలంకణ) సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అప్పలాచారి ప్రత్యేక పూజలు చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, రేలంగి పెదబాబు, కె.ముత్యాలరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులోని ఆలయాల్లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మంగమారిపేట, ఎర్నిమాంబ ఆలయంలో అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ సమర్పించారు. హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలో శివయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. ఇస్కాన్‌లో రాధాకృష్ణులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. రుషికొండలోని శ్రీవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

దేశం గర్వించేలా సీఎం జగన్ పాలన

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న పాలన అందరికీ ఆదర్శంగా, దేశం గర్వించేలా ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం తన క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. ముందుగా 3వ వార్డు పరిధిలో రూ 96.90 లక్షలతో చేపట్టనున్న సామాజిక భవనాల మరమ్మతులు, ఆధునికీకరణ, గాంధీ కల్యాణ మండపం మరమ్మతులు, మెయిన్ రోడ్డులో బస్ బే నిర్మాణం తదితర పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం అద్భుతంగా జరిగాయన్నారు. ముఖ్యంగా ఈ నెల నుంచి పింఛన్ రూ.3 వేలకు పెంచుతున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే ఎన్నో అవస్థలు పడేవారన్నారు. ప్రస్తుతం జగనన్న పాలనలో ఇంటింటికీ వలంటీర్లు వెళ్లి పింఛన్లు అందిస్తుండడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరుకుంటున్నారన్నారు. ఈ నియోజకవర్గంలో తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని, రానున్న ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, 4వ వార్డు కార్పొరేటర్ దొలుపల్లి కొండబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మేడ పైనుంచి పడి యువకుడి మృతి

బీచ్ రోడ్డు: ప్రమాదవశాత్తు మేడ పైనుంచి పడి ఒక యువకుడు మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామ్‌నగర్‌లోని ఒక రెస్టారెంట్‌లో అసిస్టెంట్ కుక్‌గా పని చేస్తున్న గణేష్ దాసు(36) అదే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం మేడ పైనుంచి ప్రమాదవశాత్తు కిందకి పడిపోయాడు. దీంతో అక్కడకక్కడే ఆయన మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడిది ఒడిశా రాష్ట్రం కాగా.. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు



నూతన సంవత్సర వేడుకల్లో ఎంపీపీ వాసురాజు, ఎంపీడీవో జానకి తదితరులు



కేక్ కట్ చేస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిన్నబాబు



వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణరావుకు కేక్ తినిపిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు

తగరపువలస: ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు పలువురిలో నూతన ఉత్తేజాన్ని నింపాయి. నియోజకవర్గంలోని అర్బన్, రూరల్ పరిధిలో పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పలువురు ఆది, సోమవారాల్లో సందడి చేశారు. ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్ది ఆదివారం రాత్రి 12 వరకు ఉత్సాహంగా కాలక్షేపం చేశారు. సోమవారం ఉదయం పలువురిని కలిసి పూలబొకేలు, దండలు అందించి స్వీట్లతో శుభాకాంక్షలు తెలిపారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి పలువురికి బహుమతులు, ఆర్థిక సాయం, దుస్తులు పంపిణీ చేశారు. మజ్జివలసలో జిల్లా వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, తాళ్లవలసలో ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, అమనాంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, శింగనబందలో జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, లక్ష్మీపురంలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, అన్నవరంలో వైస్ ఎంపీపీ సురపతి దుర్గాలమ్మకు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. జీవీఎంసీ ఒకటో వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మ, సంగివలసలో వీఎంఆర్డీఏ చైర్మన్ అక్కరమాని విజయనిర్మలను వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భీమిలి మండలం దివీస్ లేబొరేటరీకి చెందిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఎం.ఎస్.ఎన్.రావు, ట్రైనర్ సుధ, సీఎస్ఆర్ అధికారి డి.సురేష్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.

తగరపువలస: భీమిలి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఎంపీడీవో జానకికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పద్మనాభం: మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల కార్యాలయంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు కేక్ కట్ చేశారు. కేక్‌ను నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, నాయకులు మొకర అప్పలనాయుడు, సిరుగుడి ఆదినారాయణ, బూసురోతు అప్పారావు, మరగడ అప్పారావు, గాడు అప్పలరాజు, ఈర్ల ఈశ్వరరావు, తాలాడ పద్మనాభం, తాలాడ నరిసింహనాయుడు, కనకల శ్రీను పాల్గొన్నారు.

కొమ్మాది: రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ భవన్‌లో సోమవారం నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శిక్షణా భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిన్నబాబు సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం భవన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అదేవిధంగా రుషికొండలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కోలా గురువులను ఆ పార్టీ జిల్లా సెక్రటరీ జీరు వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



కోలా గురువులకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



చిట్టివలస లండన్ మిషన్ చర్చిలో చిన్నారులు



దివీస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో కొత్త సంవత్సర వేడుకల్లో అధికారులు, తదితరులు



జెడ్పీటీసీ వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బంగారునాయుడుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు



జీవీఎంసీ ఒకటో వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

ప్రజల్లోకి విస్తృతంగా ప్రభుత్వ పథకాలు



జెడ్పీ కనక మహాలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సచివాలయ అడ్మిన్లు



మధురవాడలో కేక్ కట్ చేస్తున్న మహిళలు

మధురవాడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ కె.కనకమహాలక్ష్మి చెప్పారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా ఆమెని పలువురు సచివాలయ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంకితభావంలో పనిచేయాలని సూచించారు. సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు అనీల్, సంతోష్, కళ్యాణి, ఉష, ప్రవద, జీవన్, బాలకృష్ణ, శ్రీనివాస్, రవీంద్ర పాల్గొన్నారు.

- మధురవాడలో పలు రాజకీయ పార్టీలు, కాలనీ, అపార్ట్‌మెంట్ కమిటీలు ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల యువత నూతన సంవత్సరానికి స్వాగతం... పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కేరింతలు కొట్టారు.